# నాకేం తెలుసండీ?

## తూలికా భూషణ్

'నే నే పాపమూ ఎరగను.'

అంత కుండ బద్దలు కొట్టినట్లు చెప్పడం మర్యాద కాదు. అందుచేత 'నాకేం తెలుసు?' అనడం అలనాటి హైదరాబాదు నగరంలో పరిపాటి.

అన్నిట్లో లాగానే దీనిలో కూడా ఒక కథ దాగి వుంది. కథ కాని కథ. కథ లాంటి నిజం.

నేనీ కాలం వాణ్ని కాను. ఎప్పుడో గతించిన కాలానికి చెందిన వాణ్ని. గతం మాత్రమే కలవాణ్ని.

మరొక విధంగా చెప్పాలంటే అనవసరంగా చాలా కాలం బ్రతికి ఏ కాలానికీ చెందకుండా పోయిన వాణ్ని.

ఆ గతంలో కాదు, గడిచిపోయిన ఆ గతం గర్భంలో ఎన్నో అనుభవాలు దాగి ఉన్నాయి. ఎందరో వ్యక్తులు-ఉన్నతులైనవారు. అదృష్టవశాత్తు నాతో జీవితానుభవాలు పంచుకొన్నవారు ఉన్నారు.

అలాంటి అరుదైన వ్యక్తులలో యాకూబ్ ఒకడు.

మా దినపత్రిక కార్యాలయంలో నాతో బాటు నాలుగేళ్ళు పనిచేసినవాడు.

మా యజమాని మూడు భాషలలో దినపత్రికలు ప్రచురించేవాడు.

ఇంకా చెప్పాలా? యాకూబ్ ఉర్దూ దినపత్రికలో పనిచేసేవాడు.

తెలుగు, ఇంగ్లీషు పత్రికల వాళ్ళం మేమందరమూ మా యజమానిని నమ్ముకొని బ్రతికేవాళ్ళం.

యాకూబ్ అదృష్టవంతుడు. అలాకాదు. అలనాటి మ.ఘ.వ. (మహా ఘనత వహించిన) శ్రీ నిజాం ప్రభువరేణ్యుల ప్రభుత్వంలో ఒక అధికారి.

ప్రభుత్వాధికారి ఒకరు ఏక కాలంలో ఒక ప్రైవేటు కంపెనీలో ఎలా పనిచేసేవాడనే సందేహం కలగక మానదు.

ఆ కాలం ప్రత్యేకత అదే.

యాకూబ్ మా ఉర్దూ పత్రికలో ఒక వారం పగలు పనిచేస్తే ఒక వారం రాత్రి పని చేయాలి.

అతడే 'షిఫ్ట్ ఇన్ చార్జి.'

రాత్రి మా ఆఫీసులో పనిచేయవలసిన అవసరం ఉన్నప్పుడు యాకూబ్‌కు ఎలాంటి సమస్య ఉండేది కాదు. పగలు పనిచేయవలసిన వారంలో మాత్రమే సమస్య ఏర్పడేది.

అలా అని యాకూబ్ సమస్యలతో సతమతమై తల బద్దలు కొట్టుకొనే రకం మనిషి అని కాదు.

యాకూబ్‌కు సమస్యలు లేవు.

అతడు సమస్యల కతీతుడు.

మొదట చెప్పుకున్నట్లుగా కాలం సైతం అనుకూలమైనదే.

రాత్రి పనిచేసే వారం యాకూబ్ సరాసరి ఆఫీసు నుంచి-ప్రభుత్వ కార్యాలయం నుంచి-ఆఫీసుకు, అంటే మా పత్రిక ఆఫీసుకు దయచేసేవాడు.

పగలు మా ఆఫీసులో పనిచేయవలసిన వారం యాకూబ్‌కు అటెండర్ మద్దతు అవసరం అయ్యేది.

నైజాం జమానా అనేక విధాలుగా చెడ్డది, అమానుషమైనది అని చరిత్రకారులు చెబుతూ ఉంటారు. రాజకీయవాదులు విమర్శిస్తూ ఉంటారు.

నిజమే, నైజాం జమానా చెడ్డదే. కాదనే మనిషి కలికానికైనా కానరాడు.

కాని—

ఒక్క విషయంలో మాత్రం నైజాం జమానా చాలా గొప్పది.

అటెండర్‌ను సైతం 'తమరు' అని సంబోధించే జమానా అది. అంతస్తుతో నిమిత్తం లేకుండా క్రింది ఉద్యోగులను ఎంతటి పెద్ద అధికారులు అయినా సమానులుగా గౌరవించే సంస్కారానికి పుట్టినిల్లు ఆ జమానా.

అంతేనా?

క్రింది ఉద్యోగులు ఎవరైనా తప్పు చేసినప్పుడు అది ఎంతటి పెద్ద తప్పు అయినా-పిలిచి, మందలించడం కద్దు.

ఆ పిలవడం కూడా ఎంతో గొప్పగా, విశిష్టంగా ఉండేది.

సందేశహరుడు వచ్చి, 'సాబ్ ఆప్‌కు యాద్ కర్ రహే హై' అనేవాడు. (అధికారి గారు తమర్ని గుర్తు చేసుకొంటున్నారు అని అర్థం.) అంటే తమర్ని రమ్మంటున్నారని తాత్పర్యం.

తప్పు చేసిన వాళ్ళను పిలవడం, మందలించడం జరిగేది. అంతటితోసరి. కాగితం మీద ఒక్క అక్షరం ముక్క ఉండేది కాదు.

ఇప్పుడో?

క్రింది ఉద్యోగులు తప్పుచేసినా, ఏమి చేసినా పై అధికారులు మాటలతో సరిపెట్టరు. మాటలు తియ్యగా ఉంటాయి. రసగుళికల్లా ఉంటాయి. కథ అంతా కాగితాల మీదే నడుస్తుంది. క్రింది ఉద్యోగి దెబ్బ తినడం తప్పదు.

నైజాం జమానాను బంధించి ఉంచిన సూత్రం 'కడుపు మీద కొట్టరా' అనేది.

ఆ సిద్ధాంతం మంచి చెడ్డలతో ఈనాడు మనకు పనిలేదు.

పై అధికారులకు, క్రింది ఉద్యోగులకు మధ్య ఉండే సామరస్య పూరితమైన సంబంధంతో మాత్రమే మనకు అవసరం ఉంది.

యాకూబ్ ఉదయం యథావిధిగా ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళేవాడు. షేర్వాణీ కుర్చీకి తగిలించేవాడు. సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె టేబుల్ మీద ఉంచేవాడు. అటెండర్ అందించిన మంచినీరు తాగేవాడు.

తీసుకొనివచ్చి, వినయ విధేయతలతో ముందుకు వంగి బల్ల మీద ఉంచిన అటెండెన్స్ రిజిస్టరులో సంతకం చేసేవాడు. తన సెక్షన్ సూపరింటెండెంటును స్మరించేవాడు.

అతడు వచ్చేలోగా తేనీరు సేవించి సిగరెట్టు ముట్టించేవాడు.

సూపరింటెండెంటు రాగా కుశల ప్రశ్నాదికాలయిన తరవాత 'అర్జెంటు'గా చూడవలసిన ఫైల్స్ చూసేవాడు. 'ముఖ్యమైనవి ఇంకా ఏమైనా ఉన్నాయా?' అని ప్రశ్నించేవాడు.

అదొక ఆనవాయితీ.

సూపరింటెండెంటును పంపివేసి, షేర్వాణీ, సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె ఆఫీసులో విడిచి, సరాసరి మా ఆఫీసుకు వచ్చేవాడు.

సాయంకాలం మా ఆఫీసులో పని ముగించుకొని, ప్రభుత్వ కార్యాలయం ఆ నాటికి మూసివేసే వేళకు కొంచెం నిమిషాలు ముందుగా తిరిగి వెళ్ళేవాడు.

అర్జెంటు ఫైళ్ళ మీద సంతకం పెట్టేవాడు.

షేర్వాణీ ధరించి, సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె చేతబట్టుకొని, ఇంటికి వెళ్ళిపోయేవాడు.

(ఏక కాలంలో రెండు ఉద్యోగాలు, రెండు జీతాలు!)

ఈలోగా జరిగేదేమంటే—

ప్రభుత్వ కార్యాలయంలో యాకూబ్ అనే అధికారి గారి దర్శనార్థం ఎవరైనా వచ్చేవారు. వస్తారు, మరి.

'అయ్యగారు ఉన్నారా?'
'లేరండి' అనేవాడు అటెండరు.
'ఎక్కడికి వెళ్ళారు?'
'నాకేం తెలుసు?' అటెండరు సమాధానం.
'ఎప్పుడు వస్తారు?'
'నాకేం తెలుసు?'
'అసలు వస్తారా, లేదా?' అని కోపంతో ఆగంతకుడు ప్రశ్నించేవాడు. సహజమే.

'అయ్యో! అదేం మాటండీ? తప్పక వస్తారండి.'

'ఎప్పుడు వస్తారు?'

'చెప్పాను కదండి-నాకేం తెలుసు?'

'నీకేమీ చెప్పలేదా?'

'నాకా?' అదేదో పెద్ద జోక్ అయినట్లుగా నవ్వేవాడు అటెండరు. 'ఆయన ఆఫీసరు. నేను మామూలు అంటెండర్ని.' ఆఫీసర్లు అటెండర్లతో మాట్లాడతారా అండీ?

'పోనీ, ఆయన వచ్చేదాకా కూర్చో మంటావా బాబూ?' అని అడిగేవాడు ఆగంతుకుడు.

'ప్రయోజనం ఉండదండి. ఆయన ఎప్పుడు వస్తారో తెలియనప్పుడు ఎంతసేపని కూర్చుంటారండి?' అటెండరు సమాధానం.

విసుగు, చిరాకు, కోపమూ ఆ సరికి తారాస్థాయికి చేరుకొని ఉంటాయి ఆగంతుకుడికి. పేలిపోతాడు. 'గవర్నమెంటు ఆఫీసర్లు పనిచేసే విధం ఇదేనా?' అని గర్జిస్తాడు. అటెండరు నిదానంగా ఇచ్చే సమాధానం ఒక్కటే:

'నాకేం తెలుసండి?' *

